ప్రజాశక్తి

మంగళవారం 21 మే 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

కేంద్రం యాజమాన్యం కక్ష సాధింపు

◆ 'ఉక్కు'లో జీతాలివ్వకుండా కాలయాపన ◆ స్టీల్ సిఎండి, డైరెక్టర్ల ఇళ్ల ముట్టడికి సిద్ధమవుతున్న కార్మికులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా మూడేళ్లుగా రక్షణ కవచమై పోరాడుతున్న కార్మికులపై కేంద్రం, స్టీల్ యాజమాన్యం కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నాయి. జీతాలివ్వకుండా వారి మనో ధైర్యాన్ని దెబ్బతీస్తున్నాయి. మార్చి వరకూ నెలకు రూ.2 వేల కోట్లు మార్కెట్‌లో స్టీల్ సేల్ ద్వారా టర్నోవర్ ఆర్జించిన యాజమాన్యం డబ్బుల్లేవంటూ చేతులెత్తేసింది. జీతాలుగా ఇవ్వాల్సినది రూ.85 కోట్లే అయినా జీతాలందకుండా చేస్తే పోరాటం ఆపేస్తారన్న ఆలోచనలో కేంద్రం, స్థానిక స్టీల్ యాజమాన్యం ఉన్నట్టు తెలుస్తోంది. వీరికి తోడు గంగవరం పోర్టు యజమాని అదానీ కూడా చేయి కలిపి 'ఉక్కు'ను నిర్వీర్యం చేసే కుట్రలకు పాల్పడుతున్నారు. ఈ విషయమై ఉక్కు కార్మికులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. అటు ప్రైవేటీకరణపైనా, ఇటు తమ వేతన సమస్యపైనా పోరాటాన్ని ఉధృతం చేసే దిశగా కార్మికవర్గం కదులుతోంది. సిఎండి, డైరెక్టర్ల ఇళ్ల ముట్టడికి సిద్ధమవుతోంది.

కేంద్రం డైరెక్షన్.. యాజమాన్యం యాక్షన్

విశాఖ ఉక్కును ఊపిరాడకుండా చేయాలన్న అనేక కుట్రలకు కేంద్రంలోని బిజెపి సర్కారు పాల్పడుతూనే ఉంది. స్థానిక యాజమాన్యం కేంద్రం ఆడమన్నట్టు ఆడుతూనే ఉంది. బ్లాస్ట్ ఫర్నేస్‌లను మూసెయ్యడం, బ్యాటరీలను పనిచేయకుండా చెయ్యడం, థర్మల్ ప్లాంట్ ఇక్కడ ఉన్నా సరిగ్గా వినియోగించకుండా పవర్ ఉత్పత్తికి ఆటంకాలు సృష్టించడం, రాష్ట్ర ప్రభుత్వం గనులను రెన్యువల్ చెయ్యకుండా నాటకాలాడడం వంటి పనులన్నీ కేంద్ర డైరెక్షన్ ప్రకారమే సాగాయి. స్టీల్ యాజమాన్యం తందానా అంటూ పని జరగకుండా మిగతా 2లో..



వేతన సమస్యపై ధర్నా చేపట్టి స్టీల్ ఇడి వర్క్స్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు (ఫైల్)

విస్కోలో అక్రమాలపై విచారణ జరపాలి

సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం ఇండస్ట్రియల్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్ (విస్కో)లో అక్రమాలపై విచారణ జరపాలని సిపిఎం ఫ్లోర్ లీడర్, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన జివిఎంసి కమిషనర్‌కు సోమవారం ఓ లేఖ రాశారు. విస్కోలో అక్రమాలు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయని, నిధులు దుర్వినియోగం అవుతున్నట్లు తెలుస్తోందని అన్నారు. ఐఎఎస్ అధికారి భవనానికి గెస్ట్‌హౌస్ పేరిట రూ.20 లక్షల అద్దె చెల్లింపు, వాహనాలు కొనుగోలు, కాంట్రాక్టుల నుంచి కమిషన్లు, కాలువల నిర్వహణలో అక్రమాలు, జి.20 సదస్సు సందర్భంగా పచ్చదనం, సుందరీకరణ పనులకు నిబంధనలకు విరుద్ధంగా నిధులు దుర్వినియోగం అయినట్లు తెలుస్తోందన్నారు. విస్కో ఆర్థిక వ్యవహారాలు పర్యవేక్షించేందుకు తాత్కాలిక ప్రాతిపదికన నియమించిన ఉద్యోగిపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో విస్కోపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించాలని కమిషనర్‌ను కోరారు. విచారణ రిపోర్టును కౌన్సిల్ సమావేశంలో చర్చకు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ముడసర్లోవలో నూతనంగా నిర్మించ తలపెట్టిన జివిఎంసి ప్రధాన కార్యాలయంలో కూడా 50 శాతం విస్కోకి భాగస్వామ్యం కల్పించారని, దీనిని కౌన్సిల్ సమావేశంలో సిపిఎం తీవ్రంగా వ్యతిరేకించిందని తెలిపారు. ఈ కేటాయింపులో పెద్దఎత్తున రాజకీయ అవినీతి కుట్ర ఉన్నదని సిపిఎం భావిస్తోందన్నారు.

జివిఎంసి ఆస్తులను చట్ట విరుద్ధంగా విస్కోకి బదిలీ చేసి ఆస్తులపై ప్రైవేటు వ్యక్తులు అజామాయిషీ, వ్యాపార లావాదేవీలు చేసుకోవడానికి ఈ కుట్ర పన్నినట్లు తెలుస్తోందన్నారు. త్వరలో విస్కోని ఒక రాజకీయ నాయకుడి బినామీకి కట్టబెట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోందన్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని కోరారు.

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా మే 27 నుంచి జూన్ 23 వరకు పలు రైళ్లను రద్దు చేసినట్టు ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 17219 మచిలీపట్నం - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 17239 గుంటూరు-విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 17243 గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్, 22708 తిరుపతి-విశాఖపట్నం డబుల్ డెక్కర్‌లను మే 27 నుండి జూన్ 22 వరకు రద్దు మిగతా 2లో..

తోట త్రిమూర్తులును అరెస్టు చేయాలి

▶ వార్త 2లో..

శ్రీ చైతన్యపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ధర్నా

▶ వార్త మెయిన్‌లో..

రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు

▶ వార్త 3లో..



జగదాంబ జంక్షన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ జోన్-4లోగల జగదాంబ జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. సోమవారం ఆయన జగదాంబ జంక్షన్ వద్ద నిర్మాణంలో మిగతా 2లో..

పురోగతిలేని పనులు

◆ రెండో దశ నాడు - నేడుకు నిధుల కొరత ◆ జూన్ 1న జూనియర్ కళాశాలల పున:ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు పున:ప్రారంభించే నాటికి నాడు - నేడు కింద చేపట్టిన పనులు పూర్తయ్యే అవకాశాలు కనుచూపుమేర కనబడ్డంలేదు. ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో విడుదలకాక, విడుదల చేసిన కొద్ది రోజులకు ఎన్నికల షెడ్యూల్ రావడంతో పనుల్లో పురోగతి పెద్దగా లేదు. జూన్ ఒకటి నుంచి కళాశాలలు ప్రారంభంకానున్నాయి. గడువు చాలా తక్కువ వుండడంతో యుద్ధప్రాతిపదికన నిర్మాణ, ఇతర మౌలిక సదుపాయాల పనులు చేసినా పూర్తయ్యే పరిస్థితి కానరావడం లేదు.

జిల్లాలో 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఆ కళాశాలల్లో రెండో దశ నాడు-నేడు కింద 180 రకాల పనులు చేపట్టేందుకు రూ.15.48 కోట్లును ప్రభుత్వం మంజూరు చేసింది. వీటితో ప్రధానంగా కళాశాలల మరమ్మతులు, సురక్షిత నీరు, మరుగుదొడ్లు, మిగతా 2లో..



కె.కోటపాడు జూనియర్ కళాశాలలో నిలిచిన మరుగుదొడ్ల పనులు

మొదటి పేజీ తరువాయి..

కక్ష సాధింపు

'అష్ట దిగ్బంధనం' చేస్తోంది. జీతాలిచ్చేస్తుంటే పోరాటాలు చేస్తున్నారని, పొట్ట కొట్టేస్తే ఆకలితో ఉంటారన్న కుట్రలకు తాజాగా కేంద్రం దిగింది. సుమారు 14 వేల మంది ఆఫీసర్లు, నాన్ ఎగ్జిక్యూటివ్‌లకు సుమారు రూ.85 కోట్లు ఏప్రిల్ నెల జీతంగా రావాలి. వీరితో పాటు 15 వేల మంది కాంట్రాక్ట్ వర్కర్లకు మూడు నెలలుగా జీతాలకు ఎగనామం పెట్టారు. ప్లాంట్ కాంట్రాక్టర్లకు బిల్లులను ఎగ్గొట్టేసింది. ఉత్పత్తి లేదని మార్కెట్‌లో మెటీరియల్ ఇవ్వనందున డబ్బుల్లేవని యాజమాన్యం సాకులు చెబుతోంది. ప్లాంట్‌లో థర్మల్ పవర్ ప్లాంట్ (టిపిపి)లో ఉత్పత్తి లేనందున రాష్ట్ర ప్రభుత్వం నుంచి పవర్ కొంటున్నట్లు చెబుతోంది.

అంతా యాజమాన్యం 'గేమ్ ప్లాన్'

బిఐఎఫ్ఆర్‌కు వెళ్లినప్పుడు కూడా ఇలాంటి పరిస్థితి లేదు. కష్టకాలం కరోనాలోనూ కార్మికులకు జీతాలిచ్చిన యాజమాన్యం రూ.2 వేల కోట్లు టర్నోవర్ వచ్చినా కుంటిసాకులు వెతుక్కుంటోంది. కావాలనే యాజమాన్యం గేమ్ ఆడుతోంది. రాష్ట్రంలో విజయనగరం జిల్లా గర్భాం, గరివిడిల్లో ఉన్న మైన్స్‌ను ప్రభుత్వం రెన్యువల్ చేయడం లేదు. దీంతో బయట కొనుగోళ్లు జరపడం వల్ల టన్ను దగ్గర రూ.5 వేలు భారం పడుతోంది. ప్లాంట్ నష్టాలకు ఇదొక ప్రధాన కారణం. స్టీల్ ఉత్పత్తి ద్వారా వచ్చిన డబ్బుల్లో రూ.3 వేల కోట్లును బ్యాంకుల్లో బకాయికి జమ చేస్తున్నారు. డబ్బుల్లేక కాదు కేంద్రం కావాలనే గొంతుపిసికి చంపాలన్న స్కెచ్‌ను స్టీల్‌ప్లాంట్ విషయంలో అమలుజరుపుతోంది. అదానీ తోడయ్యాడు.

పివిఎస్‌బి.శ్రీనివాసరాజు,
స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘం నాయకులు

పురోగతిలేని పనులు

అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణ పనులు సహా పలు రకాల పనులు చేపట్టాల్సివుంది. రూ.15.48 కోట్లకు గతేడాది మార్చి నాటికి రూ.7.8 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. దీంట్లో రూ.6.51 కోట్లు పనులు చేసే వారికి బిల్లులు చెల్లించారు. సాంకేతిక కారణాలతో కోటిన్నర రూపాయల వరకు చెల్లింపులు నిలిచిపోయాయి. గత డిసెంబరు నాటికి పనులన్నీ పూర్తిచేయాలని అనుకున్నా ఆశించినట్లు జరగలేదు. తరువాత ఇంటర్ పరీక్షలు జరగడం, బిల్లులు చెల్లింపులు లేకపోవడంతో పనులు పెద్దగా ముందుకుసాగలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి నిర్మాణ పనులకు సరిపడా ప్రభుత్వం నిధులు విడుదల చేసినా అంతలో ఎన్నికల షెడ్యూల్ రావడంతో పనులు చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది. పోలింగ్ అయ్యాక పనులు ప్రారంభించినా నత్తనడకన సాగుతున్నాయి. దీంతో కళాశాల విద్యార్థులు పాత సమస్యల మధ్య చదువును కొనసాగించాల్సి వస్తోంది.

పలు రైళ్లు రద్దు

చేయగా, 22701 విశాఖపట్నం-గుంటూరు డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 22702 గుంటూరు-విశాఖపట్నం డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 07466 రాజమండ్రి - విశాఖపట్నం మెము ప్యాసింజర్, 07467 విశాఖపట్నం - రాజమండ్రి మెము ప్యాసింజర్‌లను మే 27 నుండి జూన్ 23 వరకూ రద్దు చేశారు. అదేవిధంగా 17220 విశాఖపట్నం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్, 17240 విశాఖపట్నం-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 17244 రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్, 22707 విశాఖపట్నం - తిరుపతి డబుల్ డెక్కర్ రైళ్లను మే 28 నుండి జూన్ 23 వరకు రద్దు చేశారు. ప్రజలంతా ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని ఆయన అభ్యర్థించారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

ఉన్న క్లాక్ టవర్, లేపాక్షి జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా జగదాంబ జంక్షన్ క్లాక్ టవర్‌ను పరిశీలించి సుందరీకరణ పనులకు తగు సూచనలను పర్యవేక్షక ఇంజినీర్ వినయ్ కుమార్‌కు అందజేశారు. నెలాఖరుకు పనులు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం లేపాక్షి జంక్షన్ వద్ద కాలువ నిర్మాణ పనులను పరిశీలించి సర్కిల్ అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేయాలని, రోడ్డు, సెంటర్ మీడియన్ పనులను వెంటనే పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణ రాజును కమిషనర్ ఆదేశించారు. జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్ట్ ఆఫీస్ వరకు అభివృద్ధి చేసిన రోడ్డుకు ఇరువైపులా రోడ్లపై, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని జోన్-4 టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్ ప్రసాద్‌ను కమిషనర్ ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జోన్-4 జోనల్ కమిషనర్ ప్రసాదరావు, కార్యనిర్వాహక ఇంజినీర్ సుబ్బారావు, డిడిహెచ్.దామోదర్‌రావు, ఎసిపి ఝాన్సీలక్ష్మి, ఎఎంఒహెచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు నగర ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కాలుష్య నియంత్రణకు నగర ప్రజలు సహకరించాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన తమ క్యాంపు కార్యాలయం నుండి జివిఎంసి ప్రధాన కార్యాలయానికి సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జివిఎంసి యంత్రాంగం వారంలో ఒకరోజు ప్రజా రవాణాలను ఉపయోగించాలనే నిర్ణయం మేరకు జివిఎంసి అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణాలను ఉపయోగిస్తున్నారన్నారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో-జీరో పొల్యూషన్ కార్యక్రమాలలో భాగంగా నగర పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జివిఎంసి అనేక అవగాహనాపరమైన కార్యక్రమాలు నిత్యం చేపడుతుందన్నారు. నగర కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్యాన్ని నియంత్రించగలమని, అందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రసాద్‌రెడ్డి వైస్ ఛాన్స్‌లరా ? వైఎస్ఆర్ ఛాన్స్‌లరా ?

లావణ్యదేవిపై చర్యలను ఖండిస్తున్నాం
జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర యూనివర్సిటీ విసి వైస్ ఛాన్సలర్‌గా కాకుండా, వైఎస్ఆర్ ఛాన్సలర్‌గా, వైసిపి నాయకునిగా వ్యవహరిస్తున్నారని జనసేన కార్పొరేటర్ పీతలమూర్తి యాదవ్ ఆరోపించారు. సోమవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి తరగతికి చెందిన విద్యావేత్తను విసి రాజకీయ కక్షతో ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. గాజువాక అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సతీమణి డాక్టర్ లావణ్య దేవిని ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారనే నెపంతో విసి ప్రసాద్ రెడ్డి సస్పెండ్ చేశారని అన్నారు. పూర్తిగా వైసిపి కండువా కప్పుకున్న కార్యకర్తగా విసి ప్రసాద్ రెడ్డి ప్రవర్తిస్తున్నారన్నారు.

లావణ్యను ఐదేళ్లుగా వేధిస్తున్నారు : పల్లా

ఎయులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న లావణ్యను ఐదేళ్లుగా విసి ప్రసాద్ రెడ్డి వేధిస్తున్నారని, ఆమె తన భార్య కావటమే ఈ వేధింపులకు కారణమని గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ లావణ్య ఎన్నికల ప్రచారం చేశారని నోటీసు ఇచ్చారన్నారు. ఆ నోటీసుకు ఆమె లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చిందని తెలిపారు. ఆ అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా లావణ్యను సస్పెండ్ చేశారని ఆరోపించారు. లావణ్యకు రావాల్సిన ప్రమోషన్ ఆపేసారన్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామన్నారు. ఎయును వైసిపి ఆఫీస్‌గా విసి ప్రసాద్ రెడ్డి మార్చారని విమర్శించారు.



మాట్లాడుతున్న మూర్తియాదవ్

పర్యావరణాన్ని కాపాడాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని డిఎస్ఎన్ఎల్‌యు ఫస్ట్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ అన్నారు. మానవ హక్కులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. సోమవారం రామ్‌నగర్‌లోని మానవ హక్కుల కౌన్సిల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా జిల్లా అధికార యంత్రాంగంతో పాటు జివిఎంసి, పలు పార్మా, పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య నియంత్రణపై ప్రజల్లోకి అవగాహన కల్పిస్తున్నామన్నారు. మానవహక్కుల కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం విశాఖ నగరంలోని పోర్టు, స్టీల్‌ప్లాంట్, ఇతర ఫార్మా కంపెనీల కారణంగా పర్యావరణం కాలుష్యంతో నిండిపోతోందని, ఈ నేపథ్యంలో ప్రతి ప్రాంతంలోని సహజ వనరులైన గెడ్డలు, కాలువలు తదితర వాటిని కాపాడుకోవాలని అన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ ఆదేశాలను పక్కగా అమలు చేసే క్రమంలోనే మానవ హక్కుల కౌన్సిల్ కూడా భాగస్వామ్యం అయి ప్రజా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ, గాంధీయన్ విద్యా కేంద్రం డైరక్టర్ ప్రొఫెసర్ సీతామాణిక్యం పలు అంశాలను స్వచ్ఛ భారత్ అనుభవంతో రూపొందించారన్నారు. దశల వారీగా చేపట్టే ఈ అవగాహన కార్యక్రమాలకు చెందిన పోస్టర్‌లను మానవ హక్కుల కౌన్సిల్ సభ్యుల సమక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు ఎస్‌వి.రమణ, పైడిరాజు రెడ్డి, ఎన్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

తోట త్రిమూర్తులును అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇటీవల జరిగిన ఎన్నికలలో మండపేట వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన తోట త్రిమూర్తులు వల్లూరులోని దళిత మహిళా గ్రామ సర్పంచ్ దాసి మీనా కుమారిని కులం పేరుతో దూషించి దాడికి పాల్పడిన సంఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేసిందని భారత నాస్తిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు తెలిపారు. ఫిర్యాదుపై అంగర పోలీస్ స్టేషన్‌లో త్రిమూర్తులు, అతని కుమారునిపైన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదైందని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇరువురినీ తక్షణం అరెస్టు చేయాలని సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వెంకటాయపాలెంలో ఇరువురు దళితులకు 1996 డిసెంబర్ 26న శిరోముండనం చేయించి, హింసించిన ఘటనపై తోట త్రిమూర్తులకు విశాఖలోని ప్రత్యేక కోర్టు ఈ ఏడాది ఏప్రిల్ 16న జైలు శిక్ష విధించిందని, ప్రస్తుతం తోట త్రిమూర్తులు బెయిలుపై ఉండి కూడా దళిత మహిళపై దాడి చేసినందున, ఎఫ్ఐఆర్ నమోదు అయినందున బెయిల్‌ను రద్దు చేయాలని కోరారు. దళితులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

సీరత్ కమిటీ ఆధ్వర్యాన సున్తీ వైద్య శిబిరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పేద ముస్లిం పిల్లలకు ఉచితంగా సున్తీ వైద్య శిబిరాన్ని సీరత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమని వైసిపి ఉత్తర నియోజవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు అన్నారు. దక్షిణ నియోజకవర్గంలోని దొండపర్తి సింకా గ్రాండ్ హోటల్లో సీరత్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత (ఖత్నా) సున్తీ వైద్య శిబిరం సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీరత్ కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ లతీఫ్, గౌరవ అధ్యక్షులు హైదర్ ఆలీ సింకా మాట్లాడుతూ పేద ముస్లిం పిల్లలకు ఉచితంగా సున్తీ (ఖత్నా) కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. సుమారు 250 మంది పేద ముస్లిం పిల్లలకు ఉచిత (ఖత్నా) సున్తీ చేసినట్టు వెల్లడించారు. విజయవాడ నుండి విచ్చేసిన అనుభవిజ్ఞులైన వైద్యులు డాక్టర్ మౌలాలిచే ఈ ఉచిత వైద్య శిబిరం చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైసిపి మైనార్టీ శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐహెచ్.ఫారూఖీ, కమిటీ కార్యదర్శి జనాబ్ మెహబూబ్ షరీఫ్, కోశాధికారి ముస్తాక్ అహ్మద్, వ్యవస్థాపకులు షబ్బీర్, మహమ్మద్ రఫీ, మునీర్ ఖాన్, అబ్దుల్ ఆసీఫ్, అహమ్మద్ అలీ, అబ్దుల్ మునీర్, వైసిపి మైనార్టీ నేత షేక్ బాబ్జి పాల్గొన్నారు.

డిసెంబర్ 15న వైజాగ్ నేవీ మారథాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రతి ఏడాదీ ఇండియన్ నేవీ అద్వర్యంలో నిర్వహించే వైజాగ్ నేవీ మారథాన్ 9వ ఎడిషన్‌ను ఈ ఏడాది డిసెంబర్ 15న నిర్వహించనునట్టు నేవీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 42 కిలోమీటర్ల ఫుల్ మారథాన్, 21 కిలోమీటర్ల ఆఫ్ మారథాన్, 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్లు విభాగాల్లో పలు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ త్వరలో ప్రారంభమవుతుందని వెల్లడించారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT WARANGAL
D.O.P. No. 01 of 2024

Between:
Itha Ramesh . . . Petitioner
And:
Kappareddy @ Itha Eshwaramma @ Eshwari ...Respondent

NOTICE

To,
R-1: Kappareddy @ Itha Eshwaramma @ Eshwari,
W/o. Itha Ramesh,
D/o. Kappareddy Appala Narayana,
Age 34 years, Occu : Housewife,
R/o. H.No. 9-13-85,
Sivananda Puram,
New Resapuvani Palem,
P & T Colony, (VM),
Visakhapatnam Dist,
Andhra Pradesh state.

Please take notice that the above named petitioner had filed the above Divorce O.P. against you for grant of decree of divorce dissolving the marriage Dt. 02-12-2015 of petitioner with the respondent, You are hereby required to appear in this court in person or by a pleader duly instructed on the **06-06-2024 at 10-30 A.M.** failing which they said application will be heard and determined exparte.

(By Order of the Hon'ble Court)

M.VIJAY KIRAN
Advocate, Warangal
Cell : 94947 93391

'భౌ'బోయ్ కుక్కలు...



ఈ నెల 6న 14 మందికి కుక్క కాటు
బయట కాలు పెట్టాలంటే భయం
ఆందోళన చెందుతున్న బాధితులు

ప్రజాశక్తి -భీమునిపట్నం

జివిఎంసి ఒకటో జోన్ పరిధిలోని నాలుగు వార్డుల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. భీమిలి, తగరపువలస, చిట్టివలస, బ్యాంక్ కాలనీ, తోటవీధి, బోయివీధి, తిమ్మాపురం, భీమిలి మండలం చిప్పాడ, ఆశిపాలెం, రాయిపాలెం ప్రాంతాలకు చెందిన 14 మంది కుక్క కాటు బాధితులు ఈ నెల 6వ తేదీన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. చికిత్స పొందిన వారిలో వై.కళావతి, టి.నారాయణరావు, ఎ.శివాజీ, బి.భార్గవ్, కె.యోగేష్, ఎస్.రమాదేవి, కె.అప్పన్న, పి.శ్రీను, ఎం.రమణ, వి.పైడిరాజు, ఎం.హేమ, యు.కావ్య, కె.బంగార్రాజు ఉన్నారు. 7వ తేదీన మరికొన్ని ప్రాంతాలకు చెందిన ఆరుగురు, 8న ఏడుగురు కుక్క కాటుకు గురై చికిత్స పొందారు. ఈ నెల 19న తగరపువలస ప్రైవేట్ మార్కెట్ వద్ద ముగ్గురు కుక్క కాటుకు గురయ్యారు. 20న రాయిపాలేనికి చెందిన ఆర్.వెంకటరావు (49), చిప్పాడకు చెందిన ఓ మహిళ కుక్క కాటుకు గురి కాగా, భీమిలి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు.

పెరుగుతున్న కుక్క కాటు బాధితులు..

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో గత నాలుగు నెలలుగా కుక్క కాటుకు గురైన బాధితుల సంఖ్య పెరుగుతూ ఉంది. 2024 జనవరి నెలలో 126 మంది, ఫిబ్రవరిలో 426 మంది, మార్చిలో 140 మంది, ఏప్రిల్‌లో 206 మంది కుక్క కాటు బాధితులు భీమిలి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. కుక్క కాటు బాధితులకు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సకాలంలోనే స్పందించి చికిత్స అందిస్తున్నారు. చిన్న గాయమైన వారికి టిటి, ఎఆర్‌వి ఇంజక్షన్లు, తీవ్ర గాయమైన వారికి టిటి, ఎఆర్‌వి తో పాటు ఎమినోగ్లోబీలెన్స్ ఇంజక్షన్లు వేస్తున్నారు.

గుంపులుగా వీధి కుక్కల స్వైర విహారం

తగరపువలస, ఆదర్శనగర్, కొత్తపేట, కొండపేట, వెంకటేశ్వర మెట్ట, బంగ్లా మెట్ట, బ్యాంక్ కాలనీ తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తుండడంతో అటుగా వెళ్లేందుకు జనాలు జంకుతున్నారు. జివిఎంసి అధికారులు స్పందించి వీధి కుక్కల బెడదను నియంత్రించడంతో పాటు అవి వృద్ధి చెందకుండా కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించాలని, ఉన్న వాటికి యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆందోళన వద్దు.. అప్రమత్తత అవసరం..

కుక్క కాటు బాధితులు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలి. కుక్క కరిచిన వెంటనే సబ్బు, వేడి నీటితో గాయాన్ని శుభ్ర పరచాలి. రేబిస్ వైరస్ పోయేంత వరకు గాయం నుంచి రక్త స్రావం జరగనివ్వాలి. సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి, వైద్యుల సలహా మేరకు జాగ్రత్తలు తీసుకోవాలి. కరిచిన కుక్క మంచిదైనా, పిచ్చిదైనా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలి. కుక్క కరిచిన వెంటనే మూడో రోజు, ఏడో రోజు, 28వ రోజు వ్యాక్సిన్ వేయించాలి.

ఆంధ్రా ప్రిన్సెస్‌గా చిహ్నిక



పోటీలో పాల్గొన్న చిహ్నిక

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ప్రాంతానికి చెందిన ఏడేళ్ల చిహ్నిక జాతీయ స్థాయి మోడలింగ్ పోటీల్లో విజేతగా నిలిచింది. స్థానిక ఉడాకాలనీకి చెందిన రాజేశ్‌కుమార్, హారిక దంపతుల కుమార్తె చిహ్నిక చిన్ననాటి నుంచే కరాటే, వెస్ట్రన్ డ్యాన్స్, స్పెల్ బి, శ్లోకాలను చెప్పటం వంటి అంశాలపై శ్రద్ధ కనబరచటంతో తల్లిదండ్రులు ఆ దిశగా చిన్నారిని ప్రోత్సహించారు. ఇప్పటికే అనేక పోటీలలో పాల్గొని కరాటే కిక్కులు, వెస్ట్రన్ డ్యాన్సు స్టెప్పులతో అదరగొట్టిన చిన్నారి అన్ని రంగాలలోనూ అనేక బహుమతులను కైవసం చేసుకుంది. ఇటీవల కేరళలో జరిగిన జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ కార్యక్రమంలోనూ సత్తా చాటి మొదటి స్థానంలో ప్రిన్సెస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా నిలిచింది. ఓ ప్రయివేటు పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న చిహ్నిక జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజయం సాధించటంతో పాటుగా అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అందులో భాగంగా వైజాగ్ ఫర్ యూ అంటూ స్వచ్ఛంద సేవా కార్యక్రమాల నిర్వహణలో చురుగ్గా ఉండే డాక్టర్ అట్టాడ అవినాష్ చిన్నారిని ప్రత్యేకంగా అభినందించి భరోసా లిటిల్ హగ్స్ నిరాధార పిల్లల ఆశ్రమంలో పిల్లలమధ్య విజయోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు ఇద్దరూ తమ ఉద్యోగ బాధ్యతలలో తలమునకలై ఉన్నా చిన్నారిలోని ప్రతిభను ప్రోత్సహించడాన్ని అభినందించారు.



మాట్లాడుతున్న ఇపిఎస్ భాగ్యలక్ష్మి

పుస్తక పఠనంతో నూతన ఆలోచనలు

ప్రజాశక్తి -ములగాడ : పుస్తక పఠనం వల్ల మెరుగైన ఆలోచనలు వస్తాయని, ఊహాశక్తి పెరుగుతుందని ప్రముఖ రచయిత కె.సత్తిరాజు అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులలో సోమవారం ఆయన ప్రసంగించారు. పుస్తకాలను చదవడం వల్ల ఒత్తిడి తగ్గుతుందని, జ్ఞాపకశక్తి పెరుగుతుందని, మనసుకు ఉల్లాసం, ఉత్తేజం కలుగుతుందని తెలిపారు. కొన్ని పుస్తకాలు చైతన్యాన్ని కలిగిస్తాయని, సమాజ సేవకు అంకితం అయ్యేలా చేస్తాయని చెప్పారు. చిన్న వయసు నుండి నీతి కథలను చదవడం, ప్రముఖుల జీవిత చరిత్రలను తెలుసుకోవడం వల్ల వ్యక్తిత్వం వికసిస్తుందన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన గ్రంథాలయాధికారి అజయ్ కుమార్ మాట్లాడుతూ, మల్కాపురం శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు ప్రత్యేక పుస్తకాలు ఉన్నాయని, వాటిని చిన్నారులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, మద్యపానం, మత్తు పదార్థాల వాడకం వల్ల అనేక నష్టాలు ఉన్నాయన్నారు. సమాజంలోని అత్యాచారాలకు, రోడ్డు ప్రమాదాలకు, దోపిడీ, దొంగతనాలకు, శాంతి భద్రతలు లేకపోవడానికి, కుటుంబం మరియు సమాజం ఆర్థికంగా వెనుకబడ్డానికి మద్యపాన వినియోగం ప్రధాన కారణం అని తెలిపారు. అనంతరం మత్తు పదార్థాల వినియోగంపై చర్చా కార్యక్రమం జరిగింది. విద్యార్థులు సంజన, సునీత, సమత, జ్యోతిర్మయి తమ అభిప్రాయాలను తెలియజేశారు. 12 సంవత్సరాలలోపు చిన్నారులు నీతి కథలను చెప్పారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.

ఘనంగా భీముడు పండగ

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలోని బి.తాడేపుట్టు పంచాయతీ గడుగుపల్లి గ్రామంలో సోమవారం భీముడు పండుగ (కొండదోసం)ను ఘనంగా నిర్వహించారు. గిరిజన సాంప్రదాయ బద్ధంగా నిర్వహించే పండగల్లో భీముడు పండుగ (కొండదోసం)చాలా ప్రాముఖ్యమైంది. ఈ పండుగ చేయడంతో వర్షాలు బాగా కురిసి, పంటలు బాగా పండుతాయని గిరిజనుల నమ్మకం.

సకాలంలో విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు

ప్రజాశక్తి -పద్మనాభం : ఈ ఏడాది ఖరీఫ్ పంటకు రైతులకు సకాలంలో వరి విత్తనాలు పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామని మార్క్‌ఫెడ్ ఎమ్‌డి శ్రీధర్ బాబు అన్నారు. మండలంలోని మద్ది గ్రామ సచివాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ఆధునిక యంత్రాలు పంపిణీ చేయాలన్నారు. ఆధునిక యంత్రాల ద్వారానే వ్యవసాయం సులభతరంగా చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కె.రమణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వామి, భీమిలి ఎడిఎ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరానగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న కెకె.రాజు

48వ వార్డులో కెకె.రాజు పర్యటన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 48 వార్డు పరిధి ఇందిరానగర్-1 ప్రాంతంలో ఉత్తర నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలనడిగి తెలుసుకున్నారు. అక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నీలి రవి, కర్రి రామారెడ్డి, వసంతల అప్పారావు, పి.పద్మ, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య సిబ్బంది అప్రమత్తం

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: వర్షాకాల సీజన్ ప్రారంభం కానుండటంతో మూగజీవులకు వ్యాధులు సోకే అవకాశం ఉందని, పశువైద్య శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడి రాజారావు సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని పశు వైద్య శాఖ కార్యాలయాన్ని సోమవారం సందర్శించారు.పశు వైద్య శాఖ సిబ్బంది నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేశారు.

రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు



రైతులతో మాట్లాడుతున్న ఎపి మార్కెటింగ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్‌బాబు

ప్రజాశక్తి- ఆనందపురం : ప్రతి రైతు భరోసా కేంద్రంలోనూ ఎరువులు సిద్ధంగా ఉంచాలని ఏపీ మార్కెటింగ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.రాజశేఖర్‌బాబు ఆదేశించారు. ఆనందపురం మండలంలోని బోణి రైతు భరోసా కేంద్రాన్ని, పద్మనాభం మండలంలోని మద్ది రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా జరుగుతున్న ఎరువుల పంపిణీని తనిఖీ చేశారు. గ్రామ సచివాలయాలలో ఉన్న వ్యవసాయ గోదాములలో ఎరువులను నిల్వ ఉంచుకోవాలని సూచించారు. ఎరువుల పంపిణీలో జాప్యాన్ని నివారించేందుకు ప్రతి రైతు భరోసా కేంద్రంలో కనీసం 20 టన్నులు ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు మద్దిలో రైతులు తాము పండించిన మొక్కజొన్న, చోడి పంటను సకాలంలో కొనుగోలు చేయాలని, రైతులు కొంత పంటను అమ్మివేసిన తరువాత కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పంటల కొనుగోలు క్యాలెండరు తయారు చేయాలని, కనీసం 15 రోజులు ముందుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, భీమిలి సహాయ వ్యవసాయ సంచాలకులు బి.విజయ్‌ప్రసాద్, మార్క్‌ఫెడ్ డిఎం కె.రమేష్, ఆనందపురం వ్యవసాయాధికారి సిహెచ్.సంధ్యరత్నప్రభ, స్థానిక విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు పిఎండిఎస్ కిట్లు పంపిణీ



పిఎండిఎస్ కిట్లుతో రైతులు

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం తర్లువాడ, పాలవలస గ్రామంలో రైతులకు పిఎండిఎస్ కిట్లు సరఫరా చేసి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి రీజనల్ అధికారి ప్రకాష్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్‌రావు హాజరయ్యారు. రైతులకు పిఎండిఎస్ చేయడం వల్ల ఉపయోగాలను రీజనల్ అధికారి ప్రకాష్ వివరించారు. పిఎండిఎస్‌లో నవధాన్యాలు వేసి 365 రోజులు భూమిని కప్పి ఉంచడం వల్ల భూమి ఆరోగ్యంతో పాటు రైతులకు సంవత్సరం పొడవునా ఆదాయం వస్తుందని తెలిపారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మాట్లాడుతూ, పలు పంటలు వెయ్యడం వల్ల పురుగులు, తెగుళ్ల బారి నుంచి ప్రధాన పంటను కాపాడుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా నేచురల్ ఫార్మింగ్ అసోసియట్ హెచ్‌ఆర్ చక్రవర్తి, మండల సిబ్బంది పాల్గొన్నారు.

అనధికారికంగా పెట్రోల్ అమ్మితే చర్యలు : సిఐ

ప్రజాశక్తి -మధురవాడ : అనధికారికంగా దుకాణాల్లో పెట్రోల్, డీజిల్ అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని పిఎం.పాలెం సిఐ వై.రామకృష్ణ హెచ్చరించారు. పోతినమల్లయ్య పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని దుకాణంలో అనధికారంగా పెట్రోల్, డీజిల్ అమ్మిన వారిని గుర్తించి హెచ్చరికలు జారీ చేశారు. పెట్రోల్ బంకులు వద్ద సీసాలకు, డబ్బాలకు పెట్రోల్ ఇవ్వొద్దని, అలా ఎవరైనా ఇస్తే పోలీసులకు సమాచారం అందించాలని సిఐ కోరారు.

నేడు పైడితల్లమ్మ జాతర

ప్రజాశక్తి- గోపాలపట్నం : గోపాలపట్నం సమీపంలోని ప్రశాంతనగర్‌లో శ్రీ పైడితల్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఆలయ ధర్మకర్త, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆధ్వర్యాన సోమవారం సాయంత్రం నూకంబికా ఆలయ ప్రాంగణం గోపాలపట్నం నుంచి పైడితల్లి అమ్మవారి ఆలయం వరకు తోలేళ్ల సంబరాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారి ప్రతిమలతో జానపద నృత్యాలతో తోలేళ్ల సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువనాయకుడు మౌర్య సింహ, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



తోలేళ్ల సంబరంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

ఉత్తరాంధ్ర న్యాయమూర్తులకు

మధ్యవర్తిత్వంపై శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-లీగల్ : జాతీయ న్యాయ సేవ ప్రాధికార సంస్థ ఆదేశానుసారం విశాఖపట్నం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన ఉత్తరాంధ్ర న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. విశాఖపట్నం 10 న్యాయస్థానాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమాన్ని కుటుంబ న్యాయస్థానం జిల్లా న్యాయమూర్తి రాధారత్నం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అంతర్జాతీయంగా మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత పెరిగిందని, ఈ వ్యవస్థ సంతోషం, పరమం, సుఖం, అనే నినాదంతో కక్షిదారులకు కేసుల పరిష్కారం జరుగుతుందని ఆమె తెలిపారు. 2005 సంవత్సరంలో ఏర్పాటైన సుప్రీంకోర్డు మీడియేషన్ అండ్ కన్సియేషన్ ప్రాజెక్ట్ కమిటీ ద్వారా దేశవ్యాప్తంగా న్యాయమూర్తులకు, న్యాయవాదులకు శిక్షణ ఇస్తూ తద్వారా కక్షిదారులకు కేసులు పరిష్కారం రాజీ పద్ధతిన జరుగుతుందన్నారు. ఈ శిక్షణ ఈ నెల 24వ తేదీ వరకు జరుగుతుందని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, ఫస్ట్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి సింధూర తెలిపారు. ఈ శిక్షణలో మధ్యవర్తిత్వం భావన పద్ధతులను నేర్పనున్నట్లు మీడియేషన్ కమిటీ మెంబర్ సావిత్రి వి లోకేష్ చంద్ర తెలిపారు. రోల్ ప్లేలు ద్వారా శిక్షణను ఇవ్వనున్నట్లు మరో మీడియా శిక్షణ మెంబర్ రోబర్టు వి అరుణ్ తెలిపారు. ఈ శిక్షణలో ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లా న్యాయస్థానాల నుంచి 30 మందికిపైగా జిల్లా, సీనియర్, జూనియర్, న్యాయమూర్తులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, మీడియేషన్ మెంబర్లు

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-వేపగుంట : అప్పన్నపాలెం సబ్‌స్టేషన్, రవినగర్ ఫీడర్ నిర్వహణ, చెట్లు నరికివేత పనుల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జోన్-3 ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గౌతమ్ నగర్, వేపగుంట జంక్షన్, కృష్ణ నగర్, నాయుడు తోట తదితర ప్రాంతాలకు బుధవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వైభవంగా తోలేళ్ల మహోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 42వ వార్డు పరిధి అక్కయ్యపాలెంలో పరదేశమ్మ ఆలయ పంచమ వార్షికోత్సవం సందర్భంగా తోలేళ్ల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఈ ఉత్సవానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, నాయకులు శ్రీనివాస్, ఆళ్ల శివ గణేష్, నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయసాధనకు పోరాడుదాం



సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి -యంత్రాంగం

పీడిత ప్రజల ప్రియతమ నేత, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు పోరాడుదాం అని పలు చోట్ల సభల్లో వక్తలు పిలుపునిచ్చారు. విశాఖలో పలుచోట్ల సోమవారం సుందరయ్య వర్ధంతి సభలు నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గాజువాక : పెదగంట్యాడ హౌసింగ్ బోర్డు కాలనీలోని సిడబ్ల్యూసిలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సభలో సిపిఎం స్టీల్ జోన్ కార్యదర్శి పివిఎస్‌వి.శ్రీనివాసరాజు మాట్లాడుతూ, సమ సమాజం, దోపిడీ లేని సమాజం కోసం సుందరయ్య అహర్నిశలు కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం స్టీల్ జోన్ నాయకులు బి.గురప్ప, నమ్మి రమణ, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, నాయకులు డి.వెంకటరావు, పి.గురప్ప, కె.దీనబందు, పి.మసేను, కె.మల్లేశ్వరరావు, సిహెచ్.రాముడు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : నిస్వార్థ రాజకీయ నాయకుడు, దేశ రాజకీయాలకే వన్నెతెచ్చిన నేత సుందరయ్య అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పేర్కొన్నారు. ఇందిరాగాంధీ జూలాజికల్ పార్క్ వద్ద యూనియన్ ఆధ్వర్యాన వర్ధంతిని నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి యూనియన్ నాయకులు వి.నరేంద్రకుమార్, రామారావు, నరేష్, నాగేశ్వరావు, పైడిరాజు తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ, నేటి యువతరం సుందరయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్వహించాలన్నారు. నేటికీ, ఏనాటికీ సుందరయ్య రాజకీయాలకే ఆదర్శం అన్నారు. నేటి యువతరం ఆయన ఆశయాలకోసం కృషి చేయాలని కోరారు.

విశాఖ కలెక్టరేట్ : సుందరయ్య ఆదర్శవంతమైన నాయకుడని, పార్లమెంటులో మొట్టమొదటి ప్రతిపక్ష నాయకునిగా ప్రజా సేవకు తన జీవితాన్ని అంకితం చేశారని, నిజాయితీ నిబద్ధత కలిగిన అటువంటి రాజకీయ నాయకులను ఎన్నుకుంటే దేశం ప్రగతి మార్గంలో నడుస్తుందని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్య కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్ అన్నారు. సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం సింగ్ హోటల్ జంక్షన్ వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సింగనాయుడు సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేశారు. సభకు ఎం.సుబ్బారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నాయకులు పార్వతిదేవి, లక్ష్మి, రామారావు, ఈశ్వరరావు, సిమ్మన్న, అప్పన్న, శ్రీను, సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి పాల్గొన్నారు.



జూపార్కు వద్ద సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

పంది మెట్ట జంక్షన్‌లో..

సుందరయ్య వర్ధంతి కార్యక్రమం పంది మెట్ట జంక్షన్‌లోనూ జరిగింది. ఐద్వా నాయకులు కె.మణి, బి.సత్యవతి, బి.సూరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ:మండలంలోని కొండ్లకొత్తూరులో సిపిఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సిపిఎం నేతలు దేముడు నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణలు సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు



పందిమెట్ట జంక్షన్‌లో ఐద్వా ఆధ్వర్యాన....

అర్పించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ, ప్రజా ఉద్యమ నాయకుడిగా ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు కుంబోయిన కన్నబాబు, సన్నిబాబు, దేవుడు, కొండబాబు, గున్నమ్మ పాల్గొన్నారు.

కె.కోటపాడు : మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఎం జిల్లా నాయకులు గండి నాయనిబాబు పిలుపునిచ్చారు. సోమవారం. మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామంలో పార్టీ నాయకులు వనము సూర్యనారాయణ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయనబాబు మాట్లాడుతూ సుందరయ్య త్యాగనిరతిని, ఆయన సేవలను కొనియాడారు.కార్యక్రమంలో ఎర్ర దేవుడు, బొడ్డు ఆదినారాయణ, ముర్రు అప్పలనాయుడు, వనము మల్లు నాయుడు, సూరెడ్డి సన్యాస అప్పలనాయుడు పాల్గొన్నారు



అచ్యుతాపురం మండలంలో...

అచ్యుతాపురం : మండలంలో తిమ్మరాజుపేట, కాజీపాలెం, జగ్గన్నపేట గ్రామాల్లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి సిపిఎం నాయకులు ఆర్ రాము ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, శరగడము రామునాయుడు, కోరుమిల్లి రామకృష్ణ, వెలగా అచ్చంనాయుడు, కర్రి నాగు శరగడం జనార్ధనరావు, కర్రి అప్పలనాయుడు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారు మెట్ట గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పినపాత్రుని సాంబశివరావు ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. లోపూడి, బంగారమెట్ట, ఎల్‌విపి అగ్రహారం ఉపాధి హామీ కూలీలతో కలిసి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుందరయ్య నిరాడంబరత, త్యాగనిరతి, ప్రజల కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు.

కశింకోట : కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖుడు, పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నేత బొడ్డేడ సూర్యలక్ష్మి, ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి. వరలక్ష్మి, సిపిఎం మండల కార్యదర్శి దాకారపు శ్రీనివాసరావు, రాహిలమ్మ, వి. అప్పారావు పాల్గొన్నారు



కె.కోటపాడు మండలంలో...



విశాఖ నగరంలో భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యాన....

వేతన బకాయి వెంటనే చెల్లించాలి : సిఐటియు

తొమ్మిది నెలలుగా జీతాలు అందక 'డి ఎడిక్షన్' సెంటర్ కాంట్రాక్టు ఉద్యోగులు కటకట : జిల్లా కలెక్టర్ లేఖ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో మత్తు వ్యసన విముక్తి కేంద్రం(డి ఎడిక్షన్ సెంటర్)లో కాంట్రాక్టు సిబ్బందికి 9 నెలలుగా బకాయి పడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఎపి కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వివి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో కాంట్రాక్టు సిబ్బందిని కలిశారు. వారి బకాయి జీతాలు, ఇతర సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా దీనిపై తక్షణమే స్పందించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు రాసిన లేఖకు విడుదల చేసారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డిఎడిక్షన్ సెంటర్లు రాష్ట్ర వ్యాప్తంగా 26 ఉన్నాయని, వీటిలో



కలెక్టర్‌కు రాసిన లేఖ చూపుతున్న సిఐటియు నేతలు

పనిచేస్తున్న వందలాది మంది కాంట్రాక్టు సిబ్బందికి తొమ్మిది నెలలుగా వేతనాలు చెల్లించకపోతే, కుటుంబాలతో వారి జీ వనం ఎలా సాగుతుందని ప్రశ్నించారు. డ్రగ్స్, ఆల్కాహాలు, ఇతర మత్తు పదార్థాలకు బానిసలైన వారికి చికిత్స, కౌన్సిలింగ్ వంటి సేవలు అందిస్తూ వారిని స్వస్థత పరచడం ద్వారా ఆయా కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న వీరంతా వేతనాలు లేక అల్లాడుతూ దుర్భరమైన జీవనం సాగించే పరిస్థితులు కల్పించడం దారుణమన్నారు.

అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రిలోని డి ఎడిక్షన్ సెంటర్‌లో 9 మంది కాంట్రాక్టు సిబ్బంది పనిచేస్తున్నారని, వీరికిచ్చే నామమాత్రపు జీతాలను నెలల తరబడి ఇవ్వకపోతే ఎలాగని ప్రశ్నించారు. వీరికి వేతన బకాయి చెల్లించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు, ఇతర సౌకర్యాలను కల్పించాలని సిఐటియు నేతలు డిమాండ్ చేశారు.

మిత్రుల ఆర్థిక చేయూత



నారాయణరావుకు సాయం అందిస్తున్న సహచర మిత్రులు

ప్రజాశక్తి - పరవాడ: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ కుటుంబ పోషణకు బాధపడుతున్న పూర్వ మిత్రుడికి స్థానిక జెడ్‌పి హైస్కూల్ 1993-94 టెన్త్‌బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. ఐదునెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ, పూర్వ విద్యార్థి అనకాపల్లి నారాయణరావుకు ఇంటికే పరిమితమైన నేపథ్యంలో కుటుంబం పోషణ కష్టమైందన్న సమాచారాన్ని ఆలస్యంగా తెలుసుకున్న అతని సహచర మిత్రులు, పూర్వవిద్యార్థులంతా సోమవారం అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. తామంతా ఉండగా తమ పూర్వమిత్రుడు ఇబ్బంది పడకూడదని భరోసానిచ్చారు. వాట్సాప్‌గ్రూప్ అందరు మిత్రులతో కాంటాక్టు అయి, వారందరి ద్వారా సమీకరించిన రూ. 70 వేలను నారాయణరావు కుటుంబానికి అందజేశారు. కాసేపు మిత్రునితో కూర్చొని పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. తామంతా అండగా ఉంటామని, ఎటువంటి అవసరం వచ్చినా వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. తనకష్టాన్ని తెలుసుకుని పరామర్శకు రావడమే కాకుండా, ఆర్థిక చేయూతనిచ్చిన పూర్వ మిత్రులకు నారాయణరావు కుటుంబీకులు ధన్యవాదాలు తెలిపారు.

డైట్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ హ్యాపీనెస్ ప్రోగ్రాం



యోగాభ్యసన చేస్తున్న డైట్ అధ్యాపకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో పండిట్ రవిశంకర్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో హ్యాపీనెస్, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను డైట్ కళాశాల అధ్యాపకులకు, అధ్యాపకేతర సిబ్బందికి ఈనెల 20 నుంచి 25 వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ హ్యాపీనెస్ ప్రోగ్రాం ద్వారా శారీరక ఆరోగ్యాన్ని, మానసిక ప్రశాంతతను పొందవచ్చని, ఒత్తిడిని అధిగమించి జీవితాన్ని ఆనందంగా జీవించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైకుంఠరావు మాట్లాడుతూ నిత్యం యోగా సాధనతో జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ రీజినల్ డైరెక్టర్ పద్మావతి మాట్లాడుతూ ఆధునిక జీవనంలో ఒత్తిడి అంతర్భాగమైందని, హ్యాపీనెస్ ప్రోగ్రాం ద్వారా ఒత్తిడిని తగ్గించుకొని, ప్రశాంతమైన జీవితాన్ని పొందవచ్చన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్యాం ప్రసాద్, డాక్టర్ ఈశ్వరరావు, డాక్టర్ పార్వతి, అకడమిక్ కోఆర్డినేటర్ కృష్ణనాగ్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు

ప్రజాశక్తి -అనకాపల్లి : టెన్త్, ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను సిద్దార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్‌అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఎన్‌టిఆర్ 101జయంతి వేడుకల్లో భాగంగా ఎనిమిది మంది విద్యార్థులకు గాజువాక టిఎస్ఆర్, టిబికె డిగ్రీకాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అల్లాడ సౌజన్య కుమారి కండువాలు కప్పి, ప్రశంసా పత్రాలు, ఎన్‌టిఆర్ .మెడల్స్‌ను అందజేసారు.



ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరిస్తున్న సిద్ధార్థ అసోసియేషన్

ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న ప్రతిభను గుర్తించడమే గాక, అలనాటి మహా నటులు ఎన్‌టి.రామా రావు పేరిట ఆయన జయంతి వేడుకలలో భాగంగా ఇలా పురస్కారాలను అందజేసి ప్రోత్సాహించడం అభినందనీయమన్నారు. నిర్వాహక సంస్థ అధ్యక్షులు బల్లా నాగభూషణం మాట్లాడుతూ సిద్దార్థ సంస్థ ఆధ్వర్యంలో ఏటా క్రమం తప్పకుండా ఎన్‌టిఆర్ జయంతి వేడుకల్లో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి విన్నకోట నీలేశ్ గుప్తా, ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణ మోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు బొడ్డు సోమ రాజు, కొత్తూర్తి రామారావు, మావూరి సూర్య నారాయణ,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత డ్రాయింగ్ శిక్షణకు స్పందన



చిత్ర లేఖన శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి : గౌరీ గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి డ్రాయింగ్ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించారు. సోమవారం ముగింపు సమావేశంలో అనకాపల్లి మండల విద్యాశాఖ అధికారి కె.చిట్టి బాబు పాల్గొని, శిక్షణ అనంతరం నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గౌరీ గ్రంథాలయ పాలకవర్గ సభ్యులు, డ్రాయింగ్ కాంపిటేషన్ విజేతలు లిటిల్ కిడ్స్, కిడ్స్, జూనియర్, సీనియర్ విభాగాలలో విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం గ్రామంలో ఈనెల 16 జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిళ్లు దగ్ధమై, గ్యాస్ సిలెండర్ పేలిన ఘటనలో తీవ్రంగా నష్టపోయిన గొర్లి శ్రీను



ఆర్థిక సహాయం అందచేస్తున్న మోహన్

కుటుంచానికి రాజాం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమాకూర్చిన రూ.33వేల నగదును అందజేశారు. సోమవారం బాధిత కుటుంబంలోని గొర్లి శ్రీను భార్య కుమారి, తల్లి సత్యవతికి సంఘ ప్రతినిధి సుందరపు మోహన్ సాయం నగదును అందచేశారు.

ఘనంగా సిరివెన్నెల జయంతి



మాట్లాడుతున్న సత్యారావు

ప్రజాశక్తి-అనకాపల్లి : సినీ గేయరచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి గేయాలు ఒక అద్భుతమని పలువురు వక్తలు కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకోవడమే కాకుండా ఆలోచింపజేసే విధంగా సిరివెన్నెల పాటలు ఉండేవన్నారు. సోమవారం విజయ రెసిడెన్సిలో ప్రముఖ సినీ పాటల రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు. అనకాపల్లికి చెందిన సీతారామశాస్త్రి యుక్త వయసులోనే ఎన్నో పాటలు రచించి మెప్పించేవారన్నారు. తొలిచిత్రం సిరివెన్నెలకు రాసిన పాటలతో ఈ సినిమా పేరును ఇంటిపేరుగా సుస్థిరం చేసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ డిడి నాయుడు, సంఘ ప్రతినిధి సత్యారావు మాస్టారు, నాయక్, నాట్యం సినిమా డైరెక్టర్ రేవంత్, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు

విజేతలకు, వ్యక్తిగత ప్రతిభకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక వివి రమణ రైతు భారతి ఆడిటోరియంలో జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 17, 18, 19 తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ముగిసాయి. ఈ పోటీల్లో ఎంపిక చేసిన నాటక సమాజాలకు చెందిన ఆరు నాటికలను ప్రదర్శించగా, న్యాయ నిర్ణేతలుగా కోరుకొండ శేషగిరిరావు, దండు నాగేశ్వరరావు, వివి రామారావు వ్యవహరించి ఉత్తమ ప్రదర్శన, నటులు, కళాకారులను ఎంపిక చేశారు. విజేతలుగా నిలిచిన నాటక సమాజాలకు, వ్యక్తిగత ప్రతిభ కనబరిచిన కళాకారులకు దాడి రత్నాకర్ జ్ఞాపికలతో పాటు నగదు పురస్కారం అందజేశారు. ఉత్తమ ప్రదర్శనగా మైత్రి కళానిలయం విజయవాడ వారి బంధం నాటిక, ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా కళాభినయ విశాఖపట్నం వారి కాశీవాసి రావయ్య నాటిక, ఉత్తమ తతీయ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి అమత హస్తం నాటికలకు



బహుమతులను అందజేస్తున్న డైట్ చైర్మన్ రత్నాకర్

బహుమతులు అందజేశారు. అలాగే ఉత్తమ నటిగా బంధం నాటిక నుండి రత్న కుమారికి, ఉత్తమ నటుడుగా నాలోన నీవే నాటిక నుండి రామకృష్ణకు, ఉత్తమ దర్శకులుగా బంధం నాటిక నుండి టీవీ పురుషోత్తంకు, ఉత్తమ రచయితగా నాన్న బంగారు నాటిక రచయిత మూర్తికి వ్యక్తిగత బహుమతులను దాడి రత్నాకర్ అందజేశారు. అనంతరం దాడి వీరభద్రరావు 45ఏళ్లక్రితం రచించిన అనగనగా ఒకరాజు నాటిక విశాఖపట్నం కళాకారుల పిసిహెచ్ నాయుడు బృందం ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలు పొందారు.ఈ సందర్భంగా నాటిక పోటీల ముఖ్య నిర్వహకులు పిసిహెచ్ నాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో నాటిక పోటీలు జరుగుతున్నా, అనకాపల్లిలో ప్రదర్శనకు వచ్చిన ఆరు నాటక సమాజాల కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మంత్రి డైమండ్ హిట్స్ వ్యవస్థాపకులు దాడి వీరభద్రరావు, డైట్ కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్, మున్సిపల్ హైస్కూల్ పూర్వవిద్యార్థులు, రైతు భారతి ఆడిటోరియం యాజమాన్యం సహకారంతోఈ నాటిక పోటీలు ఏర్పాటు చేశామన్నారు.

కౌంటింగ్‌కు పటిష్ట భద్రతా చర్యలు

- విశాఖపట్నం రేంజ్ డిఐజి విశాల్ గున్ని
- స్ట్రాంగ్ రూం భద్రత, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై పరిశీలన

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి పార్లమెంట్‌తోపాటు జిల్లాలోని ఆరు అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపు వచ్చేనెల 4న జరగనున్న నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించుటకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని అన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఆదేశాల మేరకు జిల్లా ప్రజలందరూ ఎటువంటి ఉల్లంఘనలకు పాల్పడకుండా జిల్లా యంత్రాంగానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. సోమవారం స్థానిక ఎస్‌పి కెవి.మురళీకృష్ణతో కలిసి, శంకరం గ్రామం, కలెక్టరేట్ వద్ద గల ఫ్యూచర్ వరల్డ్ పాఠశాలలో కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను, స్ట్రాంగ్‌రూం భద్రతను పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేయుట తదితర అంశాలపైనా, స్ట్రాంగ్ రూములో ఈవీఎంలు, వీవీప్యాట్‌ల, కంట్రోల్ యూనిట్ రక్షణకు కేంద్ర బలగాలు, ఆర్మ్డ్ రిజర్వ్, సివిల్ పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాట్లును సమీక్షించారు. ఎన్నికల కౌంటింగ్ రోజు, తదనంతరం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తీసుకోవలసిన భద్రత చర్యల గురించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ రోజున 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని, అలాగే .కౌంటింగ్ ముగిసిన తర్వాత ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు చేయకూడదని, ఎవరూ గుంపులుగా తిరగరాదని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రజలందరూ సంయమనంతో వ్యవహరిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు సహకరించాలని డిఐజి సూచించారు. అదనపు ఎస్‌పి బి.విజయభాస్కర్, అనకాపల్లి డిఎస్‌పి ఎస్.అప్పల రాజు, ఎస్‌బి డిఎస్‌పి బి.అప్పారావు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలించి, సూచనలు చేస్తున్న విశాఖపట్నం రేంజ్ డీఐజీ విశాల్ గున్ని

టంగుటూరికి ఘననివాళి



నివాళులర్పిస్తున్న టిడిపి నేత గొంతిన

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని సోమవారం గ్రామంలో స్వాతంత్ర సమరయోధుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతిని నిర్వహించారు. ఆంధ్రకేసరి చిత్రపటానికి తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గొంతిన శ్రీనివాసురావు పూలమాలవేసి నివాళులు అర్పించారు. టంగుటూరి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు గొంతిన చిరంజీవి, మాజీ సర్పంచ్ కర్రి దుర్గునాయుడు, టిడిపి మండల అధికార ప్రతినిధి జెర్రిపోతుల నూకునాయుడు ముద్రగడ జగదీష్, తెరపల్లి శ్రీను, పప్పల అప్పారావు, నారిపల్లి ప్రసాద్‌కుమార్, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు

మత్స్యకారులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ప్రకృతి వైపరీత్యాల సమయంలో మత్స్యకారులు తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు, పాటించాల్సిన చర్యలపై మెరైన్ పోలీస్ స్టేషన్ సిఐ ఎన్ గోవిందరావు అవగాహన కల్పించారు. సోమవారం పూడిమడకలో మత్స్యకారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో మత్స్యకారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్లు వచ్చే సమయంలో ముందు జాగ్రత్తలను పాటించాలన్నారు. తీరంలో ఎవరు చేపల వేటకు వెళ్లరాదని, చేపల వేట సామగ్రిని భద్రపరచుకోవాలని సూచించారు. మత్స్యకారు లందరూ సురక్షితమైన ప్రదేశంలో నివసించాలన్నారు. అవగాహన సదస్సులో రాష్ట్ర మత్స్యకార సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి పరిమళ వాసు, పూడిమడక గ్రామ సర్పంచ్ చాపల సుహాసిని వెంకటరమణ, కే మురళి, కోస్ట్ గార్డ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వర్షంతో వారపుసంతలో అవస్థలు



వర్షంలో వెలవెలబోతున్న వారపుసంతలోని దుకాణాలు

ప్రజాశక్తి -కశింకోట : వర్షంతో మండలంలోని తాళ్లపాలెం సోమవారం వారపుసంత వెలవెలబోయింది. వాతావరణం మార్పు, వర్షం ప్రభావంతో వారపుసంతకు వచ్చిన వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంతకు తెచ్చిన సామాన్లు తడిసి ముద్దయ్యాయి. వర్షంతో కొనుగోలుదారులు రాకపోవడంతో తెచ్చిన సరుకులు అమ్ముడుపోక వ్యాపారులు అవస్థలు పడ్డారు. అయితే వర్షంతో వేసవి దుక్కులతోపాటు ఇతర వ్యవసాయ పనులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. తాళ్లపాలెం పరిసరాల్లో వర్షం కురవగా, కొన్ని గ్రామాల్లో వర్షం పడలేదు

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. గ్రంథాలయ ఆవరణలో వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా పిల్లలకు కుర్చీలాట పోటీ నిర్వహించారు. పిల్లలంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈసందర్భంగా లైబ్రేరియన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ, బాల బాలికలతో ఆటలాడించడం, చదివించడం, బొమ్మలు వేయుట తదితర అంశాల్లో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాల్లో తర్ఫీదునిస్తామన్నారు.

సామాజిక చైతన్యం కళాకారుల బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న దర్శకులు దాడి ముసలి నాయుడు

ప్రజాశక్తి- మునగపాక: సమాజాన్ని చైతన్యపరచే దిశగా కళాకారులు అడుగులు వేయాలని సీనియర్ రంగస్థల నటులు, దర్శకులు దాడి ముసలినాయుడు అన్నారు. స్థానిక పాటి దిబ్బ ప్రాంతంలో శ్రీలక్ష్మీ కళా యూనియన్ నాటక సమాజం మూడు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం రాత్రి నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ నటుడు నిజజీవితానికి అద్దంపట్టే విధంగా రంగస్థలంపై నటించగలిగిన నాడే ఆ ప్రదర్శనకు ప్రేక్షకాదరణ లభిస్తుందన్నారు. నాటక రంగం నానాటికి అంతరించిపోతున్న తరుణంలో లక్ష్మీ కళ యూనియన్ నాటక సమాజం మూడు దశాబ్దాలుగా నాటకాలను ప్రదర్శించడం ప్రశంసనీయమన్నారు. సమాజంలో ఉన్న నాటిక సభ్యులందరూ రైతులు, వ్యవసాయ కార్మికులుగా జీవనాన్ని గడుపుతూ, కళా రంగానికి కొంత సమయాన్ని కేటాయిస్తూ కళా ప్రదర్శనలు ఇవ్వడాన్ని బట్టి కళారంగం పట్ల ఎంత ఆసక్తి ఉందో స్పష్టమౌతోందన్నారు. కళా రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్న నాటక సమాజాలకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. నటుడు, గ్రామ ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ మాట్లాడుతూ లక్ష్మీ కళా యూనియన్‌లో సహనటుడుగా కొనసాగడం గర్వంగాఉందన్నారు. నాటక సమాజం అధ్యక్షులు బుద్ధ నాగు మాట్లాడుతూ రంగస్థల నటుడిగా ఒకవైపు ప్రదర్శనలు ఇస్తూ, మరోవైపు తన పరిజ్ఞానంతో నూతనంగా నాటిక, నాటకాలను రచించి మునగపాకలోనే కాకుండా ఇతర జిల్లాల్లో కూడా తన రచనలు ప్రదర్శనలు ఇస్తున్న యువ రచయిత దాడి జగన్నాధరావు లాంటి కళాకారులు లక్ష్మీ కళా యూనియన్‌లో ఉండటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ రైతు సంఘం అధ్యక్షులు ఆడారి మహేష్, నటులు పెంటకోట సత్యనారాయణ, దాడి జగన్నాధరావు, పెంటకోట శివాజీ, పెంటకోట సూరిబాబు, దాడి కొండలరావు మళ్ల అప్పారావు, పెంటకోట శ్రీనివాసరావు, చదరం వెంకట సూరి అప్పారావు, దాడి వీరబాబు, దాడి పోలీస్, పెంటకోట వెంకట్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే

చట్టపరమైన కఠిన చర్యలు



గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- కె. కోటపాడు: సార్వత్రిక ఎన్నికల లెక్కింపు పూర్తయ్యేవరకు గ్రామాల్లో ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సంయమనం పాటించాలని, శాంతియుత వాతావరణం నెలకొనేందుకు సహకరించాలని ఎ.కోడూరు ఎస్ఐ రమేష్ సూచించారు. సోమవారం మండలంలోని మేడిచర్ల సింగన్నదొరపాలెం తదితర గ్రామాలలో కేంద్ర బలగాలతో కలిసి పోలీసు కవాతు నిర్వహించారు. రాజకీయ ప్రేరేపితంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్, 144 సిఆర్‌పిసి సెక్షన్ అమలులో ఉన్నందున ప్రతిఒక్కరూ దానికి లోబడి వ్యవహరించాలని సూచించారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు ఎన్నికల ఫలితాలు విడుదల సమయంలో సంయమనం పాటించాలని సూచించారు.

నాణ్యమైన విత్తనాలతో ఆశాజనక దిగుబడులు



మాట్లాడుతున్న ఏడిఆర్ డాక్టర్ జగన్నాధరావు

ప్రజాశక్తి -అనకాపల్లి : రానున్న ఖరీఫ్ సీజన్లో నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ద్వారా ఆశాజనకమైన దిగుబడులు సాధించవచ్చని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పివికె. జగన్నాధరావు తెలిపారు. సోమవారం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో శిక్షణ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే నెలలో 60 శాతం వర్షపాతం నమోదయిందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకొని జనుము, జీలుగ, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట పంటలను వేసి ఖరీఫ్‌ ముందు కలియ దున్నడం ద్వారా భూసారం, నేల ఆరోగ్యం పెరిగి మంచి దిగుబడులు వస్తాయన్నారు. జిల్లా వ్యవసాయాధికారి బి మోహనరావు మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. ఖరీఫ్‌కు ముందుగానే రైతు భరోసా కేంద్రాలలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు వివిధ పంటలు బయో ఫెర్టిలైజర్స్, విత్తనాలపై అవగాహన కల్పించా లన్నారు. దీనిపై ఏడిఆర్ జగన్నాధరావు మాట్లాడుతూ ఇప్పటికే కొండంపూడి కృషి విజ్ఞాన కేంద్రంలో 12 మండలాల ఆర్‌బికె సిబ్బందికి, భాగవతుల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనకాపల్లి ఆర్ఎఆర్ఎస్‌లో వరి చెరకు విత్తనాలు అందుబాటులో ఉంచామని, కొండంపూడి కృషి విజ్ఞాన కేంద్రంలో నువ్వులు, సజ్జలు కొర్రలు, వంటి విత్తనాలు ఉన్నాయన్నారు. వీటితోపాటు బొప్పాయి, జీడి అంటి మొక్కలు అమ్మకానికి సిద్ధముగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు, విశాఖ జిల్లా ఉద్యానవన అధికారులు, ఆర్ఎఆర్ఎస్ శాస్త్రవేత్తలు, ఏఆర్ఎస్ కొక్కిరాపల్లి, కెవికె శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం పెంపు

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఖరీఫ్‌కు ముందు పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలను సాగుచేసి, వాటిని భూమిలో కలియ దున్నడం ద్వారా భూసారం పెంచుకుని ఆరోగ్యకరమైన అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారిణి ఎల్ వై కాంతమ్మ సూచించారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వపరంగా పచ్చిరొట్ట విత్తనాలను సగం సబ్సిడీ ధరపై రైతులకు అందించనున్నామని, రైతులు తమ పేర్లను సంబంధిత రైతుభరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు.

పచ్చిరొట్ట విత్తనాల సాగుతో ఖరీఫ్ ప్రధాన పంటకు ఎరువుల వాడకం తగ్గుతుందన్నారు. ఆరోగ్యకరమైన పంట, నాణ్యమైన దిగుబడి పొందవచ్చన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు పొలాలను దున్ని సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం రాయితీతో అందించే జీలుగ పదికిలోల బస్తా అసలు ధర రూ. 880కాగా, సగం రాయితీ పోను రూ. 440లకు, అలాగే జనుము 10 కేజీల రూ. 880 కాగా, రూ.440లకు, పిల్లి పెసర 8 కేజీల బస్తా పూర్తి ధర - రూ.1072కాగా, ప్రభుత్వ సబ్సిడీ పోగా రూ.536లకు రైతులు పొందవచ్చన్నారు. రైతులు ముందుగా డబ్బులు చెల్లించి, తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

గీత కార్మికుల గోడు వినేదెవరో?

-ప్రభుత్వం నుంచి అందని రుణాలు, పోత్సాహకాలు

ప్రజాశక్తి -కోటవురట్ల:ప్రకృతి వరప్రసాదని (సురా పాండం) తాటికల్లుకు గతంలో గ్రామీణ ప్రాంతాలలో విపరీతమైన ఆదరణ ఉండేది. అంత మాత్రమే కాదు గీత కార్మికులకు ఆదాయం కూడా లభించేది. ప్రభుత్వం నుంచి పలు విధాలుగా ప్రోత్సాహకాలు కూడా అందజేసేవారు. ప్రస్తుతం గీత కార్మికుల గోడు పట్టించుకునే వారే లేక వారి వృత్తి అంతరించుకు పోతుంది.



తాటికల్లు సేవిస్తున్న యువత

గతంలో మండల వ్యాప్తంగా దాదాపుగా అన్ని గ్రామాలలో గీత కార్మికులు అత్యధికంగా ఉండేవారు. రైతులు, కార్మికులు గీత కార్మికులతో సాయంత్రం సమయంలో అంతా సరదాగా ఉత్సాహంగా గడిపేవారు. చెట్ల వద్దకు వెళ్లి కొందరు, మరి కొందరు తాటి కలుల సేవించేందుకు రహదారికి ఇరువైపులా తాటికమ్మలతో పాకలు ఏర్పాటు చేసేవారు. అక్కడ కూడా సందడి వాతావరణం ఉండేది. ఇప్పుడు అటువంటి వాతావరణం ఎక్కడా కానరాలేదు.

మండల వ్యాప్తంగా ఇప్పటికి కోటవురట్ల, తంగేడు, బికేపల్లి, సుంకపూర్, పొందూరు, రామచంద్రపురం, చౌడువాడ సహా పలు గ్రామాలలో కల్లుగీతపై ఆధారపడి జీవిస్తూ ఉన్న వారు ఉన్నారు. ప్రధానంగా ఈ వృత్తిపై ఆధారపడేవారు శెట్టిబలిజలు. వీరికి ప్రభుత్వం గతంలో ప్రోత్సాహకాలు, సబ్సిడీపై రుణాలు అందజేసేవారు. ఇప్పుడు అటువంటి ప్రోత్సాహకాలు, సబ్సిడీ లోన్లు లేక పోవడంతో అధిక వడ్డీ రేట్లకు అప్పులు తెచ్చుకుని తాటికల్లు సీజన్లో అప్పులు తీర్చుకుంటున్నామని ఆవేదన చెందుతున్నారు.

ఇప్పటికీ దాదాపు చాలా గ్రామాలలో పెద్దలు మాత్రమే తాటి కల్లు గీతకు వెళ్తున్నారు. పిల్లలు ఏదో విధంగా ఆటోలు, ఇతర ఇతర ఉద్యోగాలు చేసుకుంటూ వేరే విధంగా ఉపాధి ఉండటంతో గీత కార్మికులు కనుమరుగవుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వ మద్యం దుకాణాలు అధికంగా ఉండటంతో ఈ వృత్తి రానురాను కనమరుగవుతోంది. ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేయాలని గీత కార్మికులు కోరుతున్నారు.



తాటి చెట్టు ఎక్కుతున్న గీత కార్మికుడు

ఉత్సాహంగా వేసవి శిబిరాలు



నక్కపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి -నక్కపల్లి:విద్యార్థులు ప్రతిరోజు పుస్తక పఠనం చేయడంతో మేధస్సు పెంపొందుతుందని చరిత్ర అధ్యాపకులు నాగేశ్వరరావు తెలిపారు. నక్కపల్లి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు రామాయణం, మహాభారతం, సనాతన భారతీయ ధర్మంపై బోధించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి గోవిందేశ్వరరావు పాల్గొన్నారు.

గొలుగొండ:స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బుక్ రీడింగ్, నీతి కథలు చెప్పడం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయాధికారి రాజుబాబు మాట్లాడుతూ, విదార్థులు ఈ వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోలుగుంట:స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు నిర్వహించారు. సోమవారం విద్యార్థులతో చదరంగం కాంపిటీషన్ నిర్వహించారు. ఈ పోటీల్లో 15 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. వేసవి సెలవుల్లో నిర్వహించే సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి వెంకటలక్ష్మి కోరారు.



గొలుగొండలో డ్రాయింగ్ వేసిన విద్యార్థులు



రోలుగుంటలో చదరంగం ఆడుతున్న విద్యార్థులు

నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పీ.దమయంతి ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు నిర్వహించారు. రీసోర్స్ పర్సన్ కృష్ణవేణి ఆంగ్ల భాషలో మెలకువలు వివరించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులరెడ్డి గురజాడ అప్పారావు రాసిన దేశమును ప్రేమించుమన్న గీతాన్ని పాడించి, అర్థాన్ని వివరించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ నిజాయితీ కథను తెలియ జేశారు. రిక్రియేషన్ ఆటలు ఆడించారు. విద్యార్థులకు ప్రతిరోజు స్నాక్స్ ఇస్తున్నారు.

స్ట్రాంగ్ రూమును తనిఖీ చేసిన జెసి, పిఒ

ప్రజాశక్తి- పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను అరకు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ సోమవారం తనిఖీ చేసారు. అరకు అసెంబ్లీ నియోజక వర్గంకు సంబంధించి ఇవిఎంలను భద్రపరిచిన గదులను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సిసి కెమరాలు సక్రమంగా నిరంతరం పని చేసేలా చూడాలని ఆదేశించారు. గదులకు వేసిన సీళ్లను పరిశీలించారు. భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇతరులు డిగ్రీ కళాశాల ప్రాంగణంలోకి ప్రవేశించకుండా నియంత్రించాలని ఆదేశించారు. అనంతరం లాగ్ బుక్ లో సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరు : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జెసి భావన వశిష్ఠ్ సోమవారం తనిఖీ చేసారు. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం, ఇవిఎంలను భద్రపరిచిన గదులను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సిసి కెమరాలు సక్రమంగా నిరంతరం పని చేసేలా చూడాలని ఆదేశించారు. భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం లాగ్ బుక్ లో సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న పిఒ



మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటరమణ

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:ఎన్నికల ప్రక్రియ దాదాపుగా ముగియడంతో అధికారులు కార్యాలయాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసిల్దార్ వెంకటరమణ సూచించారు. సోమవారం ఆయన రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. పెండింగ్లో ఉన్న రెవెన్యూ దరఖాస్తులు, విద్యార్థులకు సంబంధించిన దరఖాస్తులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సకాలంలో ధ్రువపత్రాలు అందజేయాలని సిబ్బందికి సూచించారు. పెండింగ్‌లో ఉన్న వివిధ దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఉర్ధవరావు, పలువురు గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఉద్యోగులు

రూ.70 వేల ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి- నక్కపల్లి:వైకెపి కమ్యూనిటీ కోఆర్డినేటర్ బోడపాటి దివినమ్మకు తోటి ఉద్యోగులు ఆర్థిక సహాయాన్ని సమకూర్చారు.కమ్యూనిటీ కోఆర్డినేటర్ గా పని చేస్తున్న దివినమ్మ ఈనెల 10న బైక్ పై విధులకు వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. 6 నెలల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జేఏసీ యూనియన్ తరపున ఉద్యోగులు రూ.70 వేలు సమకూర్చి సోమవారం డిఆర్‌డిఏ పిడి శచీదేవి, ఏపీడి చేతుల మీదుగా గాయపడ్డ దివినమ్మ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు, వైకెపి సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షిస్తున్న వైద్యులు

మెగా కంటి వైద్య శిబిరం

- ఆపరేషన్‌కు 30 మంది గుర్తింపు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద అంబేద్కర్ విగ్రహం పక్కనే ఉన్న శ్రీమైత్రి ఐ కేర్ ఆప్టికల్ షాపు వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ (అనకాపల్లి), శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి (విశాఖపట్నం) ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 90 మంది కంటి రోగులకు పరీక్షలు చేయగా 30 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మైత్రి ఐ కేర్ ఆప్టికల్ డాక్టర్ రాజా శేఖర్, శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ ఆఫీసర్ దుర్గ భవాని, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కోఆర్డినేటర్ సిహెచ్ అశ్విని కుమార్, నర్సింగ్ స్టాఫ్ శిరీష పాల్గొన్నారు.

సత్తిబాబు ఆశయ సాధనకు కృషి

-ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ- ఘనంగా సత్తిబాబు వర్ధంతి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక కృష్ణ ప్యాలెస్‌లో కార్మిక నాయకులు డి.సత్తిబాబు ప్రథమ వర్ధంతిని సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు అడిగర్ల రాజు అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్మిక నాయకులు సత్తిబాబు చిత్రపటానికి స్థానిక మున్సిపల్ కార్మికులు, ఆశ వర్కర్లు అంగన్వాడి వర్కర్లు, ముఠా, భవన నిర్మాణ కార్మికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ మాట్లాడుతూ, ప్రజల గుండెల్లో సత్తిబాబు చిరస్మరణీయుడన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆయన చేసిన సేవలు మరువలేవని కొనియాడారు. నిరంతరం ప్రజల్లోనే ఉంటూ ఆయన పోరాటాలు నిర్వహించే వారని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులకు అండగా నిలిచే పార్టీ సిపిఎం అని, మనమందరం ఉండటం చాలా ఆనందించదగ్గ విషయమన్నారు. రాజకీయ నేతలు పదవులు ఆశించి రాజకీయాలు చేస్తారని, అందుకు భిన్నంగా సత్తిబాబు పోరాటాలు చేసి నర్సీపట్నం తదితర ప్రాంతాల్లో కార్మికుల సమస్యలపై పోరాటాలు చేశారన్నారు. ప్రజల సమస్యలపై నిరంతర కృషి చేశారన్నారు. బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను హరించి, నల్ల చట్టాలు తెచ్చిందని విమర్శించారు. నిత్యవసర ధరల పెరుగుదలకు బిజెపి కారణమని దుయ్యబట్టారు. పోరాటాలు చేసి కార్మికులకు అండగా సిపిఎం నిలుస్తుందని తెలిపారు.



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి సంఘ నాయకులు దలే సత్యనారాయణ మాట్లాడుతూ, సత్తిబాబు ఎప్పుడూ ప్రజల గుండెల్లో నిలుస్తారన్నారు.

సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం అప్పలరాజు మాట్లాడుతూ, నిరాడంబరంగా జీవిస్తూ ప్రజల గుండెల్లో నిలిచిన వ్యక్తి సత్తిబాబు అని కొనియాడారు. ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసమే పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సత్తిబాబు మిత్రుడు, లాయర్ ప్రకాష్, సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్రావు, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం అప్పలరాజు, గిరిజన ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ధనార్జన్, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు త్రిమూర్తులు రెడ్డి, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ ప్రాజెక్టు ఇన్చార్జ్ మహాలక్ష్మి, బొట్టా నాగరాజు, మురళి మాస్టర్, ఐద్వా జిల్లా నాయకురాలు సూర్యప్రభ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న నాయకులు, కుటుంబ సభ్యులు

రాయితీపై విత్తనాలు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం మండలంలో 11 రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాల కోసం ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి అప్పారావు తెలిపారు. 50 శాతం సబ్సిడిపై విత్తనాలు ఇస్తున్నామని చెప్పారు. జనుము 10కేజీలకు గాను పూర్తి ధర రూ.880కాగా సబ్సిడి రూ.440 పోను 440 రైతు చెల్లించాలన్నారు. జీలుగ 10 కేజీలు రూ.800 గాను రూ.400 సబ్సిడి గాను రూ.400 రైతు వాటా చెల్లించాలని చెప్పారు. పిల్లిపెసర ఎనిమిది కిలోలకు గాను రూ.1072 కాగా రూ.536 సబిడ్సి పోను రూ.536 రైతు వాటా చెల్లించాలన్నారు. అవసరమైన రైతులు రైతు భరోసా కేంద్రం వద్ద ఆధార్, భూమి పాసు పుస్తకం, ఫోన్ నెంబర్ తీసుకోవాలని చెప్పారు.

ఎపిఆర్‌డిసిలో సత్తా చాటిన విద్యార్థి



ప్రజాశక్తి -కోటవురట్ల: ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఏపీఆర్‌డిసి ఎంట్రన్స్ పరీక్షల్లో కోటవురట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఆర్.హర్షవర్ధన్ దేవిశ్రీప్రసాద్ రాష్ట్రస్థాయిలో 29వ స్థానం సాధించాడు. నాగార్జునసాగర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో b.com సీటు సాధించాడు. కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, సిబ్బంది అభినందించారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌జెడి చిన్మయదేవి

సమయపాలన పాటించాలి

-ఆర్‌జెడి చిన్మయదేవి - అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ

ప్రజాశక్తి- వడ్డాది: వేసవి సెలవుల్లో అంగన్వాడీలు సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌జెడి చిన్మయదేవి హెచ్చరించారు. బుచ్చయ్యపేట మండలం మంగళవారం, కుముందాను పేట అంగన్వాడి కేంద్రాలను సోమవారం ఆకస్మికంగా చేశారు. అంగన్వాడి కేంద్రంలో ఉన్న రికార్డులను పరిశీలించారు. గర్భిణీలు, బాలింతలకు అందించే పౌష్టికాహారంపై ఆరా తీశారు. చిన్నారులకు మెనూ తప్పకుండా అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా పిల్లలపై జాగ్రత్త వహించి తల్లిదండ్రులు అంగన్వాడి కేంద్రాలకు పంపాలని తెలిపారు. ఆమె వెంట అంగన్‌వాడీ కార్యకర్త రాధాలక్ష్మి ఉన్నారు.

తాగునీటి సమస్యపై ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ పోతంగి పంచాయితీ సంతవలస గ్రామస్తులు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీ బిందెలతో నిరసన ఆందోళన చేపట్టారు. గ్రావిటీ పథకాన్ని పునరుద్ధరించి తక్షణమే తగునీటి సౌకర్యం కల్పించాలని పెద్ద ఎత్తున మహిళలు, గ్రామస్తులు నినాదాలు చేశారు. గ్రామంలో నిర్మించిన గ్రావిటీ పథకం గత కొద్ది రోజులుగా మరమ్మతుకు తాగునీటి సరఫరా కాకపోవడంతో మంచినీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో తాగునీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. గత్యంతరం లేక గెడ్డల్లోని ఊట నీటిని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ నీటిని తాగేందుకు అవస్థలు పడుతున్నామన్నారు. తక్షణమే సమస్య పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.


ఆందోళన చేపడుతున్న మహిళలు



ఆకాశం కనువిందు

ప్రజాశక్తి- కోటవురట్ల: ప్రకృతిలో అందమైనది ఏదైనా ఉంది అని అంటే అది ఆకాశమనే చెప్పాలి. మబ్బులు, సూర్యుడు కలయిన వాతావరణం చూస్తే ఎవరికైనా ఆకర్షణీయంగానే ఉంటుంది..సోమవారం సాయంత్రం ఆకాశంలో కల్పించిన ఈ వింత వాతావరణ దృశ్యం పలువురు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంది.

కౌంటింగ్ పూర్తయ్యే వరకూ.. శాంతియుతంగా ఉండకుంటే చర్యలు

ప్రజాశక్తి-కొత్తకోట: ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ శాంతి యుతంగా ఉండాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని కొత్తకోట సిఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. ఈ నెల 13న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఎన్నికల పోలింగ్ సందర్భంగా జరిగిన చిన్న పాటి ఘర్షణలలో ప్రమేయం ఉన్న యువకులు, నాయకులకు సీఐ సోమవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆ రోజు పోలింగ్ కేంద్రం వద్ద కొంత మంది యువకులు పరస్పరం దూషణలకు దిగారని, దీన్ని వీడియో రికార్డు చేశామని పేర్కొన్నారు.ఎన్నికల విధులలో పోలీసుల సేవలకు ఆటంకం కల్గించినా వివాదాలు సృష్టించినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎన్నికల సమయంలో కేసులు నమోదైతే ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని హెచ్చరించారు. అనవసరంగా జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. జూన్ 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ సమయంలో శాంతియుతంగా మెలగాలని సూచించా రు. అనంతరం వారి వద్ద లిఖిత పూర్వక హామీ తీసుకున్నారు.ముందస్తు చర్య గా వారందరినీ బైండోవర్ చేశామని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట ఎస్ఐ లక్షణరావు తదితరులు పాల్గొన్నారు.


కొత్తకోటలో మాట్లాడుతున్న సిఐ అప్పలనాయుడు

సభలు, సమావేశాలు నిర్వహించొద్దు

నక్కపల్లి : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాల్లో సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించ వద్దని సీఐ విజయ్ కుమార్ సూచించారు. మండలంలోని వేంపాడు, చినదొడ్డిగల్లు గ్రామాల్లో సోమవారం రాత్రి సమావేశాలు నిర్వహించారు. జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండే విధంగా ప్రజలు నడుచుకోవాలన్నారు. 144 సెక్షన్ , అదేవిధంగా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ప్రజలు రచ్చబండ, పాన్ షాపులు, టి దుకాణాల వద్ద గుమిగూడి ఉండరాదని తెలిపారు. అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడటం చట్టరీత్యా నేర మన్నారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు స్థానిక మా ప్రతినిధులను సంప్రదించండి
పాడేరు : 9490099142
నర్సీపట్నం : 9490099141
అనకాపల్లి : 8008736188
సిటీ : 9490099125
మధురవాడ : 8008596645
గాజువాక : 9849392359